# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

ఆదివారం 30-7-2023




## సక్సెస్...

### పీఎస్ఎల్వీ సీ – 56 ప్రయోగం..

### నింగిలోకి దూసుకెళ్లిన వాహక నౌక

**శ్రీహరికోట, జూలై 30(తెలుగుప్రభ):**

పీఎస్ఎల్వీ సీ–56 ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని సతీశ్ధవన్ స్పేస్సెంటర్ (షార్) నుంచి ఆదివారం ఉదయం 6.31 గంటలకు పీఎస్ఎల్వీ సీ– 56 వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. 25.30 గంటల కౌంట్డౌన్తో విజయవంతంగా కక్ష్యలోకి దూసుకెళ్లింది. దీని ద్వారా సింగపూర్కు చెందిన డీఎస్ – సార్ ప్రధాన ఉపగ్రహంతోపాటు ఆరు చిన్న ఉపగ్రహాలను ఎర్త్ ఆర్బిట్లోకి ప్రవేశపెట్టారు. మొత్తం 420 కేజీల బరువైన ఏడు ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ సీ– 56 మోసుకెళ్లింది. నాలుగుదశల్లో రాకెట్ ప్రయోగం జరిగింది. ఈ సంవత్సరం ఇస్రో ప్రయోగించిన వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాల్లో ఇది మూడోది. వాహకనౌక ఉపగ్రహాలను కచ్చితమైన కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని ఇస్రో అధిపతి డా.సోమనాథ్ ప్రయోగానంతరం తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలను అభినందించారు. ఇస్రోపై నమ్మకం ఉంచిన సింగపూర్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంవత్సరం ఆగస్ట్ లేదా సెప్టెంబర్లలో మరో పీఎస్ఎల్వీ ప్రయోగం ఉంటుందని చెప్పారు. ప్రయోగం విజయవంతం కావడంతో ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఇస్రో బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## రాహుల్కు ముగిసిన చికిత్స

**తిరువనంతపురం, జూలై30(తెలుగుప్రభ):**

కేరళలోని కొట్టక్కల్ ఆర్య వైద్యశాలలో ఆయుర్వేద చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి చికిత్స పూర్తయింది. ఎనిమిది రోజుల పాటు చికిత్స పొందిన ఆయన వైద్యాలయం డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయుర్వేద చికిత్సతో తనకు కొత్త ఉత్సాహం వచ్చినట్లుందని పేర్కొన్నారు. ఆయన ఎందుకు చికిత్స పొందారో కచ్చితంగా తెలియనప్పటికీ, భారత్జోడో యాత్రం సందర్భంగా తనకు మోకాళ్ల నొప్పులు ఉన్నాయని రాహుల్ తెలపడంతో, బహుశా అందుకే చికిత్స పొందారని భావిస్తున్నారు.



సండే స్పెషల్

# కాంగ్రెస్లో రేవంత్ కల్లోలం

### మతిలేని మాటలు.. గతి తప్పి చేతలు

### దిగజారుతున్న పీసీసీ చీఫ్ స్థాయి

### కకావికలమవుతున్న కాంగ్రెస్

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మల్కాజిగిరి ఎంపీ ఎనుముల రేవంత్రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగుతోంది. నోటికెంతొస్తే అంత.. మాట్లాడడం ఆయన హోదాకు తగదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక ఎంపీ కుండాల్సిన గౌరవాన్ని, ఒక పార్టీ అధ్యక్షుని కుండాల్సిన హోదాను మంటగలుపుతున్నారంటూ మండిపడుతున్నారు రాజకీయుల్లోని కొందరు. విమర్శలంటే ఏమిటో, వీధి తగాదాలంటే ఏమిటో తెలియని వారి వల్లే రాజకీయాలంటేనే జుగుప్స కలిగేలా ఉన్నాయంటున్నారు ఇంకొందరు. ఎటొచ్చీ అందరి మాటల్లోని సారాంశమేమిటంటే రేవంత్రెడ్డి చేస్తున్నది రాజకీయం కాదని.. పిచ్చోడి చేతిలోని రాయి తీరని.

**హైదరాబాద్, జూలై29(తెలుగుప్రభ):**

రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ పరిస్థితెలా ఉంటుందో కానీ ఇప్పుడే కకావికలమవుతున్న 'చిత్రాలు' కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో క్లౌడ్బరస్ట్తో భారీ వర్షాలు కురిసిన తరుణంలో పత్తాలేకుండా పోయిన రేవంత్రెడ్డి.. తమ ఎంపీ కనబడటం లేరంటూ పోస్టర్లు వేశాక, వర్షాలు వెలిశాక వచ్చి ప్రజల్ని పరామర్శించేందుకు బదులు కేసీఆర్, కేటీఆర్లకు పిండం పెడతానంటూ వ్యాఖ్యానించడాన్ని సామాన్యులు సైతం తప్పు పడుతున్నారు. పార్టీ గెలవడం సంగతటుంచి పోటీ చేయకముందునుంచే ఆ పార్టీలోని పలువురు సీనియర్లు సీఎం కోసం పోటీ పడుతుండటం, రేసులో తామున్నామని తెలియజేస్తుండటంతో తట్టుకోలేకో.. లేక ఎలాగూ అధికార యోగం దక్కదని తెలిసో మతి తప్పి మాట్లాడుతున్నారని, గతి తప్పి వ్యవహరిస్తున్నారని అధికార పక్ష నేతలు విమర్శిస్తున్నారు. పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే సీఎం పదవికి పోటీగా వస్తారని భావిస్తున్న వారికి లోక్సభ టిక్కెట్లు ఇచ్చేలా తెరవెనుక చక్రం తిప్పుతున్నారనే అంశాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు.

### అట్టర్ ఫ్లాప్

నిజంగా కాంగ్రెస్ పార్టీకి కానీ, రేవంత్రెడ్డికి కానీ ప్రజల మీద ప్రేముంటే.. వారిని ఆదుకోవాలనే తలంపే ఉంటే ఊళ్లే నీళ్లయిన వరంగల్ జిల్లా ప్రజలకు అండగా నిలవాల్సింది. అలాంటిది లేకపోగా, వరదలతో పెద్ద ప్రమాదాలేమీ జరగని గ్రేటర్ హైదరాబాద్లో జీహెచ్ఎంసీ ముట్టడికి పిలుపునిచ్చారు. దానికి పిలుపునిచ్చిన రేవంత్రెడ్డి ఆ కార్యక్రమంలో పాల్గొనలేదు. జీహెచ్ఎంసీకి వచ్చిన మల్లురవి, వీహెచ్, అంజన్కుమార్ యాదవ్, తదితర సీనియర్ నేతలు తమలోతాము తగవులాడుతుండటం చూసి బల్దియా సిబ్బందే ఆశ్చర్యపోయారు.. ధర్నాకు వచ్చిన వారు సైతం గ్రూపులుగా రావడం పార్టీలోని చీలికలు పేలికల్ని బట్టబయలు చేశాయి. వాస్తవాలకు భిన్న విమర్శలతో చేసిన ముట్టడి అట్టర్ఫ్లాప్ అయింది. రేవంత్రెడ్డి ఉప్పల్ పర్యటనలో సైతం గ్రూపు తగాదాలు,దాడుల ఘటనలు కొట్టొచ్చినట్లు ప్రత్యక్షమయ్యాయి. వారి గొడవల్లో పాత్రికేయులు, పోలీసులని కూడా చూడకుండా వ్యవహరించారు.

### లుకలుకలు కాదు..

మరోవైపు పీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్కుమార్రెడ్డి కాంగ్రెస్ను వీడి బీఆర్ఎస్లో చేరనున్నారంటూ ప్రచారం కావడంతో అది మా ఇంటిదొంగల పనే అంటూ ఉత్తమ్కుమార్రెడ్డి ప్రతిస్పందించారు. తమ పార్టీలోని ముఖ్యనేతే వెనక ఉండి ఇవన్నీ చేయిస్తున్నారని, ఈ విషయాన్ని పార్టీ పెద్దలకు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. పార్టీతీరుపై తనకు అసంతృప్తి ఉందనీ వెల్లడించారు. తనకు ఎలాంటి వ్యాపారాలు, భూ లావాదేవీలు లేవంటూ పరోక్షంగా తమ పార్టీలోని మరో సీనియర్ నుద్దేశించి వ్యాఖ్యానించారు. ఉత్తమ్కుమార్రెడ్డి లోపాయికారీ అవగాహనల వల్లే ఇలాంటి ప్రచారాలు జరిగాయని చెబుతున్న వారూ ఉన్నారు. కాంగ్రెస్లో ఉన్నది కేవలం లుకలుకలే కాదు కకావికలమవుతోందనడానికి ఇదో చిన్న ఉదాహరణ మాత్రమే!

తన పార్టీని చక్కదిద్దుకోలేక, తమ ఇంట్లోని అసమ్మతిని ఆర్పే తెలివి లేక, ఇంటిదొంగలెవరో గుర్తించే నేర్పురాక, రాబోయే ఎన్నికల్లో పార్టీ పుట్టి మునుగుతుందనే విషయం ముందస్తుగానే బోధపడటం వల్లే రేవంత్రెడ్డి తట్టుకోలేక పిచ్చిపట్టినట్లు వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడుతున్నారెందరో.

### ప్రశ్నించే గొంతుకంటే ?

మల్కాజిగిరి ఎంపీగా పోటీచేసే తరుణంలో ప్రజల ప్రశ్నించే గొంతుకనవుతా అని నమ్మించి గెలిచిన రేవంత్ ప్రశ్నించిందేమిటి ? తన స్థాయిని మరిచి చీటికి మాటికి కేసీఆర్, కేటీఆర్లను మాటలనడమా ? గడచిన సంవత్సరాల్లో ఎన్నిసార్లు వర్షాలొచ్చినా పట్టించుకునేందుకు నియోజకవర్గానికి రాని ఆయన వర్షాలు వెలిశాక వచ్చింది సైతం పిండం పెట్టే మాటలకేనా అంటూ వ్యాఖ్యానించారు ఉప్పల్కు చెందిన సతీష్. ఇస్తాంబుల్, డల్లాస్లలోనే కాదు.. వర్షాలొస్తే ఎక్కడైనా నిలిచేది నీరేనని, వెలిశాక ఎన్ని గంటలకు పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చాయో చూడాలని.. ఏమీ చేతకానప్పుడే వైరిపక్షంపై విమర్శలు పెరుగుతాయన్నారు మానసిక విశ్లేషకుడు ఆకాశ్.



# మహారాష్ట్రపై గులాబీ బాస్ ఫోకస్

**హైదరాబాద్, జూలై 30 (తెలుగుప్రభ)**

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. దేశ రాజకీయాలపై దృష్టి పెట్టిన ఆయన అన్ని రాష్ట్రాల్లోనూ విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా ఆగస్టు 1న మహారాష్ట్రలో పర్యటించనున్నారు. ఒక రోజు పర్యటన నిమిత్తం వెళ్తున్న ఆయన అదే రోజు సాయంత్రానికే తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. అయితే.. మహారాష్ట్ర దళిత నేత అన్నా బావ్ సాటే జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తుండడం ఆసక్తికరంగా మారింది. కొల్లాపూర్లోని మహాలక్ష్మి అమ్మవారిని కూడా దర్శించుకోనున్నారు. ఆ తర్వాత సాహు మహారాష్ట్ర మనుమడిని ఆయన నివాసానికి వెళ్ళి కలవనున్నారు. దళిత నేత జయంతి ఉత్సవాల్లో కేసీఆర్తో పాటు మహారాష్ట్రకు చెందిన పలు పార్టీల నేతలు కూడా హాజరుకానున్నారు. రాజకీయంగా ఆ రాష్ట్రంపై ఫోకస్ పెట్టిన కేసీఆర్ మహారాష్ట్రలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల ఆ రాష్ట్రం నుంచి వివిధ పార్టీలకు చెందిన నేతలు పదుల సంఖ్యలో బీఆర్ఎస్లో చేరుతున్నారు. ప్రగతి భవన్లోనూ పలువురు నేతలను కేసీఆర్ చేర్చుకుంటున్నారు.



## చాంబర్ ఎవరిది?

### నువ్వా.. నేనా అన్నట్లుగా టీఎఫ్సీసీ ఎన్నికలు

### మధ్యాహ్నం 3 వరకూ జరగనున్న పోలింగ్

**హైదరాబాద్, జూలై 30 (తెలుగుప్రభ)**

టాలీవుడ్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ టీఎఫ్సీసీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో ప్రొడ్యూసర్ సెక్టార్, డిస్ట్రిబ్యూషన్ సెక్టార్, స్టూడియో సెక్టార్, ఎగ్జిక్యూటివ్ సెక్టార్.. ఇలా దాదాపు మొత్తం సభ్యులు 3000 మంది సభ్యులు ఉన్నారు. నిర్మాతలే దాదాపు 1600 మంది ఉన్నారు. ఈ రోజు దాదాపు 900 వరకు ఓట్లు నమోదయ్యే అవకాశం ఉంది. సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. సాయంత్రం 6 గంటలకు ఫలితాలు వెల్లడవుతాయి. ఈ సారి ఈ ఎలక్షన్స్ మరింత రసవత్తరంగా మారాయి. స్టార్ నిర్మాత దిల్ రాజ్ ప్యానెల్ వర్సెస్ సి కళ్యాణ్ ప్యానల్ పోటీ పడుతున్నాయి. ఇద్దరూ ప్రముఖ నిర్మాతలే కావడంతో ఎన్నికలు ఆసక్తికరంగా మారారాయి. చాంబర్ కొత్త అధ్యక్షుడు ఎవరనేది నేటి సాయంత్రం లోపు తెలిసిపోతుంది.



## అమెరికా అధ్యక్ష రేసులో ఎన్నారైలు

**హైదరాబాద్, జూలై 30(తెలుగుప్రభ):**

అమెరికా అధ్యక్ష స్థానానికి ముగ్గురు ఎన్నారైలు పోటీ పడుతున్నారు. ఇప్పటికే ఇద్దరు ఎన్ఆర్ఐలు నిక్కీహేలీ, వివేక్ రామస్వామి బరిలో ఉండగా, తాజాగా మరో ఎన్ఆర్ఐ హర్ష్ వర్ధన్ చేరారు. ఇంజినీర్ అయిన హర్ష్ వర్ధన్ 2024అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నట్లు వెల్లడించారు. ఆయన ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ వద్ద తన అభ్యర్థిత్వాన్ని నమోదు చేసుకున్నారు. ముగ్గురు ఎన్ఆర్ఐలు సైతం రిపబ్లికన్ పార్టీ తరపునే పోటీ చేయాలనుకుంటుండటం విశేషం.

## హుస్సేన్సాగర్లోకి కారు

**హైదరాబాద్, జూలై 30(తెలుగుప్రభ):**

మితిమీరిన వేగంతో ఓ కారు అదుపుతప్పి హుస్సేన్సాగర్లో పడిపోయింది. ట్యాంక్బండ్పై ఎంతో బీభత్సరం సృష్టించిన ఆ కారు హుస్సేన్సాగర్లోకి దూసుకు వెళ్లినప్పటికీ కారులోని ఎయిర్ బెలూన్లు తెరచుకోవడంతో ప్రమాదం తప్పింది. కార్లోంచి బయటకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. క్రేన్ సహాయంతో కారును హుస్సేన్సాగర్లోంచి బయటకు తీశారు.